క్లుప్తంగా

అధికార పార్టీ తీరు అప్రజాస్వామికం

బోట్‌క్లబ్: ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్ సీపీకి ఇవ్వాల్సిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ పదవి కూడా అధికార పార్టీకి ఇచ్చుకోవడం తగదని, ఇది పూర్తిగా అప్రజాస్వామికమని నగర పౌర సంక్షేమ సంఘ కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపక్ష సభ్యుల సంఖ్యతో ప్రమేయం లేకుండా అసెంబ్లీలో ఉన్న ఏకైక ప్రతిపక్షానికి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలన్నారు. ప్రజాస్వామిక లక్షణాలతో కల్పించాల్సిన బాధ్యతాయుత విలువలకు తావు లేకుండా కూటమి ప్రభుత్వం అధికార పార్టీకి కట్టబెట్టుకోవడం దారుణమన్నారు. నేనే రాజు, నేనే మంత్రి తరహాలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. శాసన మండలి వల్ల ప్రజావాణి మూగబోకుండా వినబడుతోందన్నారు. ప్రభుత్వ వైఖరి ఎలా ఉన్న ప్రజల్లో ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం ఎప్పుడూ సజీవంగానే ఉంటుందన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో ఒక్కరికి నాలుగు రోజు జైలు, 13 మందికి రెండు రోజులు చొప్పున జైలు, 13 మందికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. వివరాల్లోకి కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. శుక్రవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

ముగిసిన 'కౌశల్' పోటీలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): వారం రోజులుగా నిర్వహిస్తున్న కౌశల్ సైన్స్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు శుక్రవారం ముగిసాయి. భారతీయ విజ్ఞాన మండలి (బీవీఎం), సైన్స్ సిటీ ఆంధ్రప్రదేశ్, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 241 పాఠశాలల నుండి 3,378 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 120 మందిని ఎంపికచేసి డిసెంబర్ 6న జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తామని జిల్లా సైన్స్ అధికారి వినీల్ తెలిపారు. శ్రీ నగర్ మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో పోటీలను జిల్లా కో–ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

స్నానఘట్టం ప్రారంభం



స్నానఘట్టాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

కరప: బతికున్న తల్లిదండ్రులను పట్టించుకోని ఈ రోజుల్లో వారి జ్ఞాపకార్థం స్నానఘట్టం నిర్మించడం అభినందనీయమని సర్పంచ్ మార్నెళ్ల శ్రీనివాసరావు (శివ) పేర్కొన్నారు. మండలంలోని యండమూరులో శుక్రవారం గుర్రాల రాముడు, గంగారత్నం దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు గుర్రాల రాజబాబు రూ.1.2 లక్షలతో నిర్మించిన స్నానఘట్టాన్ని సర్పంచ్ శివ ప్రారంభించారు. గ్రామంలో ఎవరైనా మరణిస్తే, అంత్యక్రియల అనంతరం చెరువులో స్నానాలు చేసేవారని, ప్రస్తుత పరిస్థితుల్లో చెరువు అపరిశుభ్రంగా ఉండడంతో స్నానం చేయకుండానే ఇంటికి వెళ్లిపోతున్నారని తెలిపి, స్నాన ఘట్టం నిర్మాణంతో గ్రామస్తులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దైవజనుడు రెవరెండ్, జాన్ సూర్యప్రకాష్, మండల అంబేడ్కర్ యువజన సంఘం కార్యదర్శి ప్రత్తిపాటి బుల్లిరాజు, వడ్డపాటి గోపి, బొమ్మిరెడ్డి కృష్ణ, నందికొల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కృష్ణావతారంలో సీతారామస్వామి



బోట్‌క్లబ్: రజత చిన్న దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి అర్చకులు పంచామృతాభిషేకాలు, అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సినిమాలు



ఆనంద్ సినిమాస్	మట్కా, కంగువ, మెకానిక్ రాకీ, అమరన్
దేవీ‌స్క్రీన్స్	మెకానిక్ రాకీ, కంగువ, మందిర, అమరన్
పద్మప్రియ	లక్కీ భాస్కర్
శ్రీప్రియ	జీబ్రా
సిఅండ్‌సి–1	అమరన్,
సిఅండ్‌సి– 2	దేవకీ నందన వాసుదేవ
సూర్య	దేవకీ నందన వాసుదేవ,
సూర్య2	జీబ్రా
లక్ష్మీ	జీబ్రా
సత్యగౌరి	మందిర
తిరుమల	కంగువ

చలిలో వెచ్చని నెచ్చెలి

- దిగజారుతున్న ఉష్ణోగ్రతలు
- జోరుగా ఉన్ని దుస్తుల వ్యాపారం
- కాకినాడలో సుమారు 40 ప్రాంతాల్లో వెలసిన దుకాణాలు
- గజగజకు చెక్ పెడుతున్న ప్రజలు



కాకినాడ–కరప రోడ్డులో నడకుదురు వద్ద రగ్గులు, స్వెట్టర్లు విక్రయిస్తున్న వ్యాపారి

కాకినాడ సిటీ: కాలచక్రం గతి తప్పేసింది. నిరుడు ఉన్నట్టు వర్తమానం ఉండడం లేదు. నేడున్నట్టు రేపు ఉండడం లేదు. వర్షాలు, చలి, వేసవి ఏ కాలానికి ఆ కాలమే నువ్వా నేనా అన్నట్టు పోటీ పడుతూ వాటి ప్రభావాన్ని చూపుతున్నాయి. వర్తమానానికి వస్తే ఉష్ణోగ్రతలు అంతకంతకూ పడిపోతున్నాయి. సాయంత్రం ఆరు గంటల నుంచే చలి గాలులు వీస్తూ గజగజ వణికిస్తున్నాయి. మంచి వయసులో ఉన్న యువత సైతం చెవులకు ఒంటికి తగిన రక్షణ లేకుండా బయటకు రాలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో స్వెట్టర్లు, జెర్కిన్లు, హుడీలు, మంకీ క్యాప్‌లు, గ్లోవ్‌లను ప్రజలు ఆశ్రయిస్తున్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల నుంచి స్థానిక మార్కెట్లకు తీసుకు వచ్చిన ఉన్ని దుస్తులపై ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. దాదాపు వంద రోజుల పాటు ఇక్కడే ఉండి తమ వ్యాపారాలు చేసుకుని వెళ్లి పోతారు.

కాకినాడ జిల్లా సముద్రతీరం వెంబడి ఉండడంతో పాటు మడ అడవులు అధికంగా ఉండడంతో స్వతహాగానే ఇక్కడ చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీంతో కాకినాడలో సుమారు 40 ప్రాంతాల్లో రోడ్ల వెంబడి రంగురంగుల ఉన్ని దుస్తులు విక్రయిస్తున్నారు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు వివిధ డిజైన్లలో ఈ విక్రయాలు జోరందుకున్నాయి. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలు పోషించుకుంటున్నామని, మాకు తెలిసిన స్వెటర్ల తయారీ మమ్మల్ని ఈ దేశ ప్రజలందరికీ పరిచయం చేసి, మాపై నమ్మకాన్ని పెంచిందని వ్యాపారులు అంటున్నారు. అందులో కాకినాడ పట్టణ, రూరల్ ప్రాంతాల ప్రజలు 45 ఏళ్లుగా చూపుతున్న ఆత్మీయతను ఎప్పటికీ మరచిపోలేమని ఇక్కడి వారితో తమ అనుబంధాన్ని వ్యాపారులు వివరిస్తున్నారు.

ఇదీ వారి దినచర్య

ఈసారి రాజస్థాన్, మధ్యప్రదేశ్, కోయంబత్తూరు, మైసూర్ ప్రాంతాల నుంచి 120కి పైగా కుటుంబాల వారు ఉన్ని దుస్తుల వ్యాపారం కోసం కాకినాడ సిటీ, రూరల్ ప్రాంతాలకు వచ్చారు. అందులో కొందరు స్థానికులను సహాయకులుగా చేర్చుకుని సరకు విక్రయిస్తున్నారు. వారంతా కాకినాడ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇళ్లు తీసుకుని అద్దెకు ఉంటున్నారు. ఉదయం 6 గంటలకు లేవడం, టిఫిన్, మధ్యాహ్నం భోజనం తయారు చేసుకోవడం వీరి దినచర్య. టిఫిన్ గది వద్దనే చేసుకుని ఉదయం 10 గంటల కంతా షాపుల వద్దకు చేరుకుంటారు. రాత్రి 11 గంటల వరకు వ్యాపారం ముగించుకుని తిరిగి ఇళ్లకు చేరుకుంటారు. వచ్చీ రానీ భాషతో మాట్లాడుతూ వ్యాపారం చేస్తారు.

అన్ని రకాల ఉన్ని దుస్తులు లభ్యం

రాజస్థానీయులు, మధ్యప్రదేశ్‌లకు చెందిన వ్యాపారుల దుకాణాల్లో చిన్నారులు, పెద్దలకు సంబంధించిన అన్ని రకాల ఉన్ని దుస్తులు టూ ఇన్ వన్ రెయిన్ కోట్లు (రెగ్జిన్లు), బెడ్‌షీట్లు నాణ్యమైనవి లభ్యమవుతున్నాయి.

నాణ్యమైన దుస్తులే విక్రయిస్తాం



మేము నాణ్యమైన ఉన్ని దుస్తులే విక్రయిస్తాం. ధరలు కూడా ఫిక్స్‌డ్‌గా ఉంటాయి. ఏటా నవంబర్ మొదటి వారం నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు వ్యాపారం చేస్తాం. మాపై కస్టమర్లు మంచి ఆదరణ చూపిస్తున్నారు.

జగదీష్, వ్యాపారస్తుడు, రాజస్థాన్

ధరలు ఇలా..

స్వెట్టర్లు	రూ.400–రూ.1,500
రెయిన్ కోట్లు	రూ.1000–రూ.1,500
శాలువాలు	రూ.300–రూ.600
మంకీ క్యాప్‌లు	రూ.80–రూ.150
మఫ్లర్	రూ.50–రూ.200
గ్లౌజులు	రూ.100–రూ.200
బెడ్‌షీట్లు (రగ్గులు)	సింగిల్ : రూ.600

సకాలంలో బ్యాంకు గ్యారెంటీలు సమర్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్ మీనా

కాకినాడ సిటీ: జిల్లాలో ఖరీఫ్ 2024–25 ధాన్యం సేకరణకు సంబంధించి రైస్ మిల్లర్లు సకాలంలో బ్యాంకు గ్యారంటీలు సమర్పించాలని జేసీ రాహుల్ మీనా అన్నారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లాలోని రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, పౌరసరఫరాల సంస్థ, పౌర సరఫరాల శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలింపు, గోనె సంచులు, బ్యాంకు గ్యారెంటీలు, సీఎంఆర్ తదితర అంశాలపై చర్చించారు. జిల్లాలో 277 రైతు సేవ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు సాగుతున్నాయని, ఈ మేరకు రైస్‌మిల్లర్లు సకాలంలో బ్యాంకు గ్యారెంటీలు అందజేయాలన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఎం.దేవుల నాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంపీ ప్రసాద్, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం ఉపాధ్యక్షుడు కె.సూర్యప్రకాష్, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కొల్లాబత్తులకు సత్కారం

బోట్‌క్లబ్: ఇటీవల రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికైన కొల్లాబత్తుల అప్పారావును రైతులు, వ్యాపారులు సత్కరించారు. స్థానిక గాంధీనగర్ రైతు బజార్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రైతు బజార్ వ్యాపారస్తులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వన్‌స్టాప్ సెంటర్ ఇన్‌చార్జ్ శైలజ

బోట్‌క్లబ్: బాలికలు గుడ్, బ్యాడ్ టచ్‌లపై అప్రమత్తంగా ఉండాలని వన్ స్టాప్ సెంటర్ ఇన్‌చార్జి శైలజ అన్నారు. స్థానిక జగన్నాథపురంలోని చర్చ్ స్క్వేర్ సెంటర్‌లోని సెయింట్ ఆన్స్ హైస్కూల్‌లో శుక్రవారం మహిళా స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహిళలు, బాలల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎవరైనా బ్యాడ్ టచ్ చేస్తే స్కూల్‌లో ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. మీపై ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే తక్షణం 1098, 112 నెంబర్‌లో ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో వన్ టౌన్ వుమెన్ పోలీస్ శిరీష, స్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం అమృతవల్లి, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

కో–ఆర్డినేటర్‌ను బదిలీ చేయొద్దు



పాఠశాల ఆవరణలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

బాలాజీచెరువు: సమగ్రశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో భవిత కేంద్రంలో ఐఈఆర్‌టీఈ కో–ఆర్డినేటర్ నారాయణరావును బదిలీ చేయవద్దంటూ విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. నగరంలోని ఫ్రేజర్‌పేట పగోడా స్కూల్ ఆవరణలో ఉన్న భవిత కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న నారాయణరావు, వరలక్ష్మి కొంతకాలంగా పొసగడం లేదు. దీంతో అధికారులు నారాయణరావును తాళ్లరేవుకు, వరలక్ష్మిని కిర్లంపూడికి బదిలీ చేశారు. దీంతో శుక్రవారం ఉదయం నారాయణరావును బదిలీ చేయవద్దంటూ వారు పాఠశాల ఆవరణలో ఆందోళన చేపట్టారు.

శాంతిభద్రతలపై పటిష్ట పర్యవేక్షణ

- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం: శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ అధికారులు, సిబ్బంది కట్టుబడి ఉండాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. శుక్రవారం కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అధ్యక్షతన నేర సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమీక్షలో మహిళలు, చిన్నారుల భద్రత, డిజిటల్ అరెస్టు, రౌడీషీటర్లపై నిఘా, గంజాయి నియంత్రణ, ఎఫ్ఐఆర్‌ల నమోదుపై జాప్యం, ఆర్థిక నేరాలు, మహిళా రక్షక్‌ల సేవలు, సైబర్ నేరాల నియంత్రణ, ఫిర్యాదుదారులతో స్టేషన్ అధికారులు, సిబ్బంది మర్యాదకరంగా నడుచుకోవడం అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దొంగతనాల్లో సొత్తు రికవరీ చేసిన సామర్లకోట సీఐ కృష్ణభగవాన్, క్రైం సీఐ అంకబాబులకు ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేశారు. వారి సిబ్బందిని అభినందించారు. అలాగే అత్యధిక డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినందుకు కోరంగి ఎస్ఐ సత్యనారాయణకు ఎస్పీ ప్రశంసా పత్రమిచ్చి అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

శ్రేయో ఔషధాలు తయారు చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

- జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ
- డ్రగ్ డిస్కవరీపై సదస్సు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సమాజ శ్రేయస్కార ఔషధాలు తయారుచేయాలని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ డాక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్స్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఫార్మసీ విద్యార్థులకు 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాల శుభాకాంక్షలు తెలియజేశారు. జ్ఞానం అనేది భవిష్యత్ కరెన్సీ వంటిదని, భారతదేశం భవిష్యత విద్యాకేంద్రంగా అవతరించనుందన్నారు. ప్రపంచం అంతా భారతదేశ విద్యార్థుల వైపు చూస్తోందని, విద్యార్థులు ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉంటూ మంచి పరిశోధనలు చేపట్టాలంటే దురలవాట్లకు దూరంగా ఉంటూ సూర్యకాంతిని పొందాలన్నారు. ధూమపానం, మద్యపానం, మదక ద్రవ్యాలకు దూరంగా ఉండడంతో పాటు భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు అత్యుత్తమ ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఫార్మారంగంలో తమ ఆలోచనలను పరిశోధనలుగా మలిచి ఉత్తమ ఔషధాల రూపకల్పనకు కృషి చేయాలన్నారు. ఫార్మాసిస్టులకు ఏ రంగంలో లేని డిమాండ్ ఉందని, అవకాశాలు అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలన్నారు. లైలా న్యూట్రాస్యూటికల్స్ జీఎం డాక్టర్ ఏవీ కృష్ణంరాజు మాట్లాడుతూ డ్రగ్ డిస్కవరీ అనేది కొత్త ఔషదాల అభివృద్ధితో కూడిన సంక్లిష్టమైన ప్రక్రియ అన్నారు. వ్యాధుల జీవ విధానాలను అర్థం చేసుకోవడంతో పాటు ఔషధ లక్ష్యాలను ఎంపిక చేసుకోవడం జరుగుతుందన్నారు. భవిష్యత్‌పై చక్కని ప్రణాళికతో ముందుకు సాగేందుకు ఫార్మసీ రంగంలో అన్ని సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలన్నారు. మనం నైతిక విలువలతతో పని చేసినప్పుడు జీవితంలో విజయం సాధిస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫార్ములేషన్ డీజీఎం డాక్టర్ కిశోర్‌బాబు, ఫార్మసీ ప్రత్యేక అధికారి పద్మప్రియ, ఫార్మసీ హెడ్ భవానీ, ఐఐపీటీ డైరెక్టర్ బీటీ కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశ రుద్రాభిషేకం



ప్రత్యేక అలంకరణలో త్ర్యంబకేశ్వరస్వామి

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో పార్వతీసమేత త్ర్యంబకేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశ రుద్రాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకుడు చైతన్య బృందం మహాశివుడికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉదయం గణపతి పూజ అనంతరం ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన చేశారు. సాయంత్రం నీరాజన మంత్ర పుష్పాల సమర్పణ, ఆశీర్వచనం నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు సమర్పించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తం



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రఘువీర్ విష్ణు

- డీఎస్పీ రఘువీర్ విష్ణు
- నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో అవగాహన సదస్సు

కాకినాడ రూరల్: ఆధునిక ప్రపంచంలో సైబర్ నేరాలు తీవ్రంగా పెరిగిపోయాయని వాటి పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ రఘువీర్ విష్ణు కోరారు. అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో శుక్రవారం కాకినాడ రూరల్ సీఐ చైతన్య కృష్ణ అధ్యక్షతన సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు కళాశాలల విద్యార్థుల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించి, వాటిని ఎదుర్కొనేందుకు చైతన్యం తీసుకు వస్తున్నామన్నారు. డిజిటల్ అరెస్టు, స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, కేవైసీ ఫ్రాడ్ తదితర నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మేరకు వీడియోలు, పోస్టర్లతో అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ కమలకుమారి మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్ల వినియోగంలో భాగంగా ఆన్‌లైన్‌లో లావాదేవీలు ఎక్కువగా జరుతున్నందున అపరిచిత లింకులను క్లిక్ చేయకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. సీఐ చైతన్య కృష్ణ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు రకరకాలుగా మోసాలకు పాల్పడతారని, ఈజీ రుణాలు అని ఉచ్చులోకి దింపి మనకు తెలియకుండానే మన ఫోన్లలోకి చొచ్చుకువస్తారని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్సై రవీంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులకు ఏ అవసరం వచ్చిన తక్షణమే అందుబాటులో ఉంటామని, అపరిచిత కాల్స్ పట్ల జాగ్రత్తలు పాటించాలని, అనుమానం వస్తే తక్షణమే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

26న కలెక్టరేట్ వద్ద ధర్నా



వేళంగిలో ధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్

కరప: సమస్యల పరిష్కారానికి ఈ నెల 26 తేదీన కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాకు భవననిర్మాణ కార్మికులు, స్కీమ్ కార్మికులు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, ఔట్ సోర్సింగ్ కార్మికులు తరలి రావాలని ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ అనుబంధం) అధ్యక్షుడు గణేశుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలం వేళంగి మార్కెట్ సెంటర్ వద్ద శుక్రవారం ధర్నా పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధరలు రెట్టింపయ్యాయన్నారు. స్కీమ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని వివిధ శాఖల్లో పనిచేస్తున్న కార్మికులు కోరుతున్నా పట్టించుకోని కేంద్ర ప్రభుత్వ పనితీరును ఆయన విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేయాలని, దుర్మార్గమైన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని తదితర డిమాండ్లతో ధర్నా చేయనున్నట్టు శ్రీనివాస్ తెలిపారు. గరగ ప్రసాద్, నొక్కు చంటి, కొల్ల దుర్గ, కె.విజయ్‌కుమార్, టి.రాజు, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఒప్పందాలను రద్దుచేయాలి

కాకినాడ సిటీ: అదానీ గ్రూపు సంస్థలతో సెకీ నుంచి రాష్ట్ర డిస్కంలు చేసుకున్న ఒప్పందాలపై ముడుపుల ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో వాటిని రద్దు చేసుకోవాలని సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం రాజశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కాకినాడలో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో పంప్డ్ స్టోరేజి విద్యుత్ ప్లాంట్లు, విశాఖలో డేటా సెంటర్, గంగవరం పోర్టు వంటి వివిధ ప్రాజెక్టుల కోసం చేసుకున్న ఒప్పందాలను రద్దుచేసి అదానీని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా వ్యాప్త ఆందోళనలకు ఆయన పిలుపునిచ్చారు.

అనుమతి లేని హోర్డింగ్‌లు తొలగించండి

- కమిషనర్‌కు మాజీ కార్పొరేటర్ వినతి



మాజీ కార్పొరేటర్ బాలాప్రసాద్

కాకినాడ: అనుమతి లేకుండా ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేస్తున్న హోర్డింగ్‌లను తక్షణమే తొలగించాలని మాజీ కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ నాయకుడు కె.బాలాప్రసాద్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన నగర పాలక సంస్థ కమిషనర్ భావనకు వినతి పత్రం అందజేశారు. ఈ నెల 11వ తేదీన జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్లాస్టిక్ బ్యానర్ల ఏర్పాటుపై నిషేధం ఉందన్నారు. ఈ ఉత్తర్వులను అనుసరించి నగరంలో ప్రభుత్వ స్థలాల్లో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయరాదన్నారు. ఇందుకు విరుద్ధంగా ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ ముత్తా గోపాలకృష్ణ వారధి వద్ద మిలటరీ రోడ్డు ప్రాంతంలో నగర పాలక సంస్థకు చెందిన స్థలంలో ఇష్టారాజ్యంగా హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారన్నారు. తుఫాన్‌లు, విపరీతమైన గాలులు వీస్తే వీటి వల్ల ప్రజలకు తీవ్ర హాని కలిగే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే వాటిని తొలగించాలని కమిషనర్‌ను కోరారు.

ఢిల్లీ పోలీసులమని మోసగాళ్ల హల్‌చల్

- 'సాక్షి' కథనంపై అవగాహనతో సమయస్ఫూర్తితో పోలీసులకు ఫిర్యాదు
- ఉడాయించిన ఆగంతకులు

కరప: ఢిల్లీ పోలీసులమని హంగామా చేసిన మోసగాళ్ల నుంచి మండలంలోని విజయరాయుడుపాలెం సర్పంచ్ వెలుగుబంటి సీతారామ రాఘవ తృటిలో తప్పించుకున్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు శుక్రవారం రాత్రి ఇద్దరు వ్యక్తులు పోలీసు దుస్తుల్లో ఆయన ఇంటికి వచ్చి హిందీ, ఇంగ్లిషు భాషల్లో మాట్లాడుతూ హంగామా సృష్టించారు. దీంతో తెలుగులో మాట్లాడాలని వారిని సర్పంచ్ నిలదీశారు. దీంతో తాము తెచ్చుకున్న ఫైళ్లలోకి చూస్తూ ఏవో కుంటి ప్రశ్నలు వేస్తుండడంతో అనుమానం వచ్చిన సర్పంచ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ లోపులో చుట్టుపక్కల వారు పోగవడంతో మోసగాళ్లిద్దరూ వారి మోటారు సైకిళ్లపై ఉడాయించారు. సాక్షి దినపత్రికలో సరికొత్త పంథాలో మోసం పేరుతో వచ్చిన కథనం చదివిన తనకు వారిని చూడగానే అనుమానం వచ్చి పోలీసులకు ఫోన్ చేసినట్టు ఎస్సై సునీతకు వివరించారు.

దంత సంరక్షణపై అవగాహన



దంత సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సత్యనారాయణ

కాకినాడ రూరల్: దంత సంరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ప్రముఖ దంత వైద్యుడు అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. జాతీయ ఫ్లాసింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, పార్థసారధి, ప్రసాదనాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల విషయంలో అసత్యాలు తగవు

- మంత్రుల ప్రకటనలపై సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

కాకినాడ సిటీ: వలంటీర్ల విషయంలో అసెంబ్లీలో మంత్రి బాల వీరాంజనేయస్వామి ప్రజలకు అసత్యాలు చెప్తుంటే చంద్రబాబు మౌనంగా ఉండడాన్ని తప్పుబడుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీ గ్రామ, వార్డు వలంటీర్ల సంఘం కలెక్టరేట్ వద్ద శుక్రవారం నిరసన ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, వలంటీర్ల సంఘం నాయకులు వరుణ్, నందేశ్వరరావు మాట్లాడుతూ 2023 ఆగస్టు తర్వాత వలంటీర్లను రెన్యువల్ చేయకుండా 2024 మే వరకు వేతనాలు ఎలా చెల్లించారని ప్రశ్నించారు. ఎన్నికల విధుల నుంచి వలంటీర్లను తప్పించాలని హైకోర్టుకు ఎందుకు వెళ్లారని నిలదీశారు. దేవాలయం లాంటి అసెంబ్లీలో ప్రజలకు అసత్యాలు చెప్పడాన్ని మానుకోవాలన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లను కొనసాగించి రూ.10 వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఆశలతో కూటమి నేతలకు ఓట్లు వేసి గెలిపిస్తే ఇలా అబద్ధాలు చెప్పి నమ్మకాన్ని పోగొట్టుకోవద్దని అవసరమైతే వలంటీర్లందరినీ సమీకరించి కలెక్టరేట్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. అడక్కుండా హామీలు ఇచ్చి, అడుక్కునేలా చేశారని నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు ప్రకాష్, ఏవీ గంగాధర్, ఇ.వరుణ్‌కుమార్, సంతోషి, లక్ష్మీప్రసన్న, భవాని, నాగలక్ష్మి, త్రిపుర సుందరి, భ్రమరాంబిక తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో రాష్ట్ర జట్టు ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా ఖో–ఖో సంఘం ఆధ్వర్యంలో కాకినాడ జేఎన్టీయూకే ఇండోర్ స్టేడియంలో 15 రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఖో–ఖో శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఖో–ఖో కోచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర జట్టును ఎంపిక చేశారు. డి.నందిని, జి.పావని, ఎస్.సుహాసిని, డి.సత్యలను తూర్పుగోదావరి నుంచి, ఆర్.సత్యవతి, ఆర్.తనుజ, కె.కళ్యాణి శ్రీకాకుళం, ఐ.భవాని, కె.పవిత్రలను నెల్లూరు నుంచి, ఆర్.యశోద, టి.సుస్మిత ప్రకాశం నుంచి, కె.లహరిని విశాఖ నుంచి, ఆర్.సత్యవతిని చిత్తూరు నుంచి, జి.అనితను కృష్ణా జిల్లా నుంచి రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. ఈ జట్టు నవంబరు 25 నుంచి 29 వరకు ఉత్తర్‌ప్రదేశ్‌లో నిర్వహించే 43వ జాతీయ జూనియర్ నేషనల్ చాంపియన్ షిప్‌లో పాల్గొననుంది.

బహిరంగ ప్రకటన

[illegible]

షెడ్యూలు

E.G.Dt., Kakinada Rural, Kakinada SRO, Turangi Gram Panchayat in Old RS No. 64/1, 64/2 and 65 now new RS No. 75/5, 75/6, 76/1 for an extent of 1354 sq.yards of vacant site is measured and bounded by.

Item-1 : (5431/2019) - East : 20' Width Road, North : Plot No.7, West : Other's Property, South : Plot No.9

Item-2 : (5429/2019) - East : 20' Width Road, North : Plot No.8, West : G.Tata Rao Property, South : Plot No. 10

Item-3 : (5429/2019) - East : 20' Width Road, North : Plot No.9, West : G.Tata Rao Property, South : Plot No.11

Item-4 : (5432/2019) - East : 20' Width Road, North: Plot No.10, West : Others Property, South : Others Property (Present BT Road)

Item-5 : East : 20' Width Road, North: Plot No.1, West : Others Property, South : Plot No.3

Item-6 : East : 20' Width Road, North : Plot No.2, West : Others Property, South : Plot No.4

Item-7 : East : 20' Width Road, North: Others Property, West : Sunyam, South : Plot No.2

NVBL ACHARI, Advocate
Jangareddy Gudem. Cell : 94402 15126